



మెరుగుపరుద్దాం!



జఫర్‌గఢ్ మండలం హిమ్మత్‌నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రం



- అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతంపై సర్కారు దృష్టి
- నిఘా నేత్రాలు, బయోమెట్రిక్ అమలుకు కసరత్తు
- ఈజీఎస్ నిధులతో సొంత భవనాల నిర్మాణం
- సీఎం హామీతో చిగురించిన ఆశలు
- జిల్లాలో మొత్తం 695 అంగన్‌వాడీ కేంద్రాలు

జఫర్‌గఢ్, మార్చి 14 : చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య, బాలింతలు, గర్భిణులకు పోష్టికాహారం అందించి వారి ఆరోగ్య రక్షణ, సంక్షేమంలో అంగన్‌వాడీ కేంద్రాలు ప్రధాన భూమిక పోషిస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త సహకారంతో ఈ కేంద్రాలు నడుస్తున్నాయి. అయితే అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏళ్ల తరబడి కనీస సౌకర్యాలు లేక అటు సిబ్బందితో పాటు లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. అనేక కేంద్రాలకు పక్కా భవనాలు లేక అసౌకర్యాల మధ్య కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో వాటిని బలోపేతం చేయడంతో పాటు లబ్ధిదారులకు మరింత నాణ్యమైన సేవలు అందించే దిశగా తెలంగాణ సర్కార్ చర్యలు చేపడుతోంది. కొద్ది రోజుల క్రితం మహిళా శిశు సంక్షేమంపై నిర్వహించిన సమీక్షలో అంగన్‌వాడీ కేంద్రాల పటిష్టత కోసం సీఎం రేవంత్‌రెడ్డి పలు నిర్ణయాలు ప్రకటించారు. కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు, బయోమెట్రిక్ అమలు చేయాలని, ఉపాధి హామీ నిధులచే అన్నీ ఒకే తరహాలో ఉండేలా పక్కా భవనాలు నిర్మించేలా దస్త్రాలు సిద్ధం చేయాలని.. చిన్నారులకు సంబంధించిన ఆట వస్తువులు, ఇతర సామగ్రి కోసం ప్రతిపాదనలు పంపాలని.. ఇందుకు అవసరమైన నిధులను మంజూరు చేస్తామని ప్రకటించడంతో వ్యవస్థ బలోపేతంపై ఆశలు చిగురిస్తున్నాయి.

మెరుగైన సేవలు - పారదర్శకతకు అవకాశం..

అంగన్‌వాడీ కేంద్రాలపై అధికారుల పర్యవేక్షణ కొరవడినట్లు విమర్శలు ఉన్నాయి. నిర్వాహకులు సమయపాలన పాటించకపోవడం, కొన్ని చోట్ల కేంద్రాలను సక్రమంగా తెరువకపోవడం, అనధికారిక సెలవులు, లబ్ధిదారులకు ఇవ్వాల్సిన సరుకులు దస్త్రాల్లో ఇచ్చినట్లు నమోదు చేసి పక్కదారి పట్టించడం వంటి ఆరోపణలు వస్తున్నాయి. తాజా నిర్ణయాల ద్వారా సేవలు మెరుగుపడితే ఇలాంటి ఆరోపణలు, అక్రమాలకు ఇక చెక్ పడనుంది. కేంద్రాల్లో బయోమెట్రిక్, సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశాలతో నిర్వహణలో పారదర్శకతకు అవకాశం ఏర్పడుతుంది. సాంకేతిక ఉపకరణాల ఏర్పాటుతో సిబ్బంది, లబ్ధిదారుల హాజరు కచ్చితంగా తెలుస్తుంది. అలాగే కేంద్రానికి వచ్చిన సరుకులు, రోజు వారీగా వాడకంపై పర్యవేక్షణ ఉంటుంది. విద్యుత్ లేని కేంద్రాల్లో సౌకర్యం కల్పిస్తారు. సరుకుల సరఫరాపై నిఘా పెట్టి అక్రమాలపై చర్యలు తీసుకుంటారు. సొంత భవనాలు లేని, అద్దె భవనాల్లో కొనసాగే కేంద్రాలు సొంత భవనాలకు నోచుకోవడంతో పాటు అన్ని రకాల వసతులు సమకూరుస్తారు. ఫలితంగా కేంద్రాల్లోని చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్యను పూర్తి స్థాయిలో అందించేందుకు వీలు కలుగుతుంది.

జిల్లాలో 18 టీచర్, 70 ఆయా పోస్టులు ఖాళీ

జిల్లాలోని మూడు ప్రాజెక్టుల పరిధిలో మొత్తం 695 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 220 కేంద్రాలకు సొంత భవనాలు ఉండగా, 198 కేంద్రాలు అద్దె భవనాల్లో, మిగతా 277 ప్రభుత్వ పాఠశాలల్లో కొనసాగుతున్నాయి. మొత్తం కేంద్రాల్లో 3-6 ఏళ్ల పిల్లలు 13,607 మంది, ప్రీ స్కూల్ పిల్లలు 9,581 మంది, గర్భిణులు 2,958 మంది, బాలింతలు 2,896 మంది ఉన్నారు. అయితే జిల్లా వ్యాప్తంగా 18 అంగన్‌వాడీ టీచర్లు, 70 ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఖాళీలను భర్తీ చేస్తే మెరుగైన ఫలితలు చేకూరే అవకాశం ఉంది. ఖాళీల వివరాలను ప్రభుత్వానికి నివేదించామని, త్వరలోనే భర్తీ ప్రక్రియ చేపట్టనున్నారని అధికారులు చెబుతున్నారు.

ఈజీఎస్ నిధులతో సొంత భవనాలు..

జిల్లాలో ప్రస్తుతం 198 అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. సీఎం ప్రకటనతో తొలి ప్రాధాన్యతతో ఉపాధి హామీ పథకం ద్వారా వాటికి సొంత భవనాల నిర్మాణం చేపట్టనున్నారు. దీంతో కేంద్రాలపై అద్దె భారం తొలగి.. ఒకే నమూనాతో జిల్లా వ్యాప్తంగా కేంద్రాలకు మౌలిక వసతులు సమకూరనున్నాయి. అయితే భవనాలకు స్థల సేకరణ విషయమై ప్రభుత్వం నుంచి స్పష్టత రావాల్సి ఉంది.

పూర్వ ప్రాథమిక విద్య బలోపేతం..



- జెట్టి జయంతి, మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి

ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయంతో అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్య మరింత బలోపేతం అవుతుంది. చిన్నారుల సంఖ్య పెరగడంతో పాటు పారదర్శకతకు అవకాశం ఉంటుంది. సౌకర్యాలు మరింత మెరుగుపడతాయి. పిల్లల శారీరక, మానసిక, సామాజిక ఎదుగుదల, అభివృద్ధి కోసం 03-05 ఏళ్లలోపు పిల్లలను తల్లిదండ్రులు విధిగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలి. వారికి ఆటపాటలతో పూర్వ ప్రాథమిక విద్యను అందిస్తాం.

బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించాలి

రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

అధికారులతో కలిసి వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



చిలుపూర్ గుట్ట బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి సురేఖ

చిలుపూర్, మార్చి 14 : చిలుపూర్ గుట్ట బుగులు వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 16వ తేదీ నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో వైభవంగా నిర్వహించాలని రాష్ట్ర దేవాదాయ, అటవీశాఖ మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లోని బీఆర్ అంబేడ్కర్ రాష్ట్ర సచివాలయంలో దేవాదాయ శాఖ అధికారులతో కలిసి వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. అంతకుముందు ఆలయ ఈవో భాగం లక్ష్మీప్రసన్న మంత్రి సురేఖకు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ రాష్ట్రంలోనే రెండవ తిరుపతిగా ప్రసిద్ధి చెందుతున్న బుగులు వేంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని భక్తులు పెద్దసంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున కనీస సదుపాయాలు కల్పించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్‌తో పాటు అదనపు కమిషనర్ కురాకుల జ్యోతి, కృష్ణవేణిలకు ఆహ్వాన పత్రికలను అందజేశారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకుడు బ్రాహ్మణపల్లి రవీందర్ శర్మ, సముద్రాల కృష్ణమాచార్యులు, జూనియర్ అసిస్టెంట్ రమేష్, గాదె రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బోనాల కోలాటం కళాకారులకు ఘన సత్కారం

అవార్డు అందించిన మంత్రి సీతక్క



కళాకారులకు ప్రోత్సాహక చెక్కులు అందజేస్తున్న మంత్రి సీతక్క

లింగాలఘణపురం, మార్చి 14 : అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన ఉత్తమ మహిళా కళాకారులను హైదరాబాద్ రవీంద్రభారతిలో గురువారం ఘనంగా సత్కరించారు. బోనాల కోలాటం విభాగంలో ఉత్తమ మహిళా కళాకారులుగా ఎంపికైన లింగాలఘణపురం మండలం నెల్లుట్ల గ్రామానికి చెందిన బండి రాములమ్మ, గొరిగె నీలను మంత్రి సీతక్క ఘనంగా సత్కరించారు. అంతేకాకుండా ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీతలు బండి రాములమ్మ, గొరిగె నీల మాట్లాడుతూ గ్రామీణ కళలకు తెలంగాణ ప్రభుత్వం ఊపిరిపోస్తుందని హర్షం వ్యక్తం చేశారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు

- చివరి రోజు 98 శాతం విద్యార్థుల హాజరు

జనగామ కల్చరల్, మార్చి 14: ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు గురువారం ముగిశాయి. చివరి రోజు 98.01 శాతం విద్యార్థులు హాజరైనట్లు డీఐఈవో బైరి శ్రీనివాస్ పేర్కొన్నారు. సెకండియర్ విద్యార్థులకు కెమిస్ట్రీ, కామర్స్ పరీక్షలు నిర్వహించారు. 3,663 మంది విద్యార్థులకు గాను 73 మంది గైర్హాజరు కాగా, 3,590 మంది హాజరైనట్లు అధికారులు తెలిపారు. జనరల్ స్ట్రీమ్‌లో పరీక్షలు ముగిసిపోగా, మరో రెండు రోజుల పాటు బ్రిడ్జి కోర్సు పరీక్షలు జరుగనున్నాయి. పరీక్షల సందర్భంగా ఇప్పటి వరకు ఐదు మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదయ్యాయి. పరీక్షలకు సహకరించిన ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల యాజమాన్యాలకు డీఐఈవో కృతజ్ఞతలు తెలిపారు.

బాధ్యతలు స్వీకరించిన డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్



బాధ్యతలు స్వీకరిస్తున్న హరీశ్‌రాజ్

జనగామ కల్చరల్, మార్చి 14: జనగామ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిగా బి.హరీశ్‌రాజ్ గురువారం బాధ్య తలు స్వీకరించారు. వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి ఆర్ఎం వో, వరంగల్ జిల్లా ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోగా పనిచేస్తున్న హరీశ్‌రాజ్‌ను జనగామ డీఎంహెచ్‌వోగా ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు ఆయన బాధ్యతలు స్వీక రించిన అనంతరం కలెక్టర్ షేక్ రిజ్వాన్ భాషాను మర్యాదపూర్వకంగా కలిశారు.

'టీజీ'లోనే తెలంగాణ ఆత్మగౌరవం

- ఉద్యమ సమయంలో వాహనాలన్నీ టీజీగా మార్చుకున్నాం..
- నేటినుంచి కొత్త వాహనాలకు 'టీజీ' సిరీస్‌తో రిజిస్ట్రేషన్లు : రవాణా శాఖ మంత్రి పొన్నం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హనుమకొండ కలెక్టరేట్, మార్చి 14 : టీజీ అనే పదంలో తెలంగాణ ఆత్మగౌరవం ఉందని రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హనుమకొండ కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ఉద్యమ సమయంలో వాహనాలన్నీ ఏపీ అని ఉంటే టీజీగా మార్చుకున్నామన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత కేంద్ర ప్రభుత్వం జూన్ 2న గెజిట్ కూడా టీజీ అనే ఇచ్చిందని గుర్తు చేశారు. కానీ, అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం మాత్రం ఏ ఉద్దేశంతోనో కేంద్ర ప్రభుత్వానికి నివేదించి టీఎస్‌గా మార్పించిందన్నారు. అయితే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కేబినెట్, శాసనసభ తీర్మానాన్ని కేంద్ర ప్రభుత్వానికి అందించామని, దానికి అనుగుణంగానే తెలంగాణ రాజపత్రంలో టీఎస్ స్థానంలో టీజీగా మారుస్తూ గురువారం ప్రకటించిందన్నారు. ఇది పార్టీ పరంగానో, వ్యక్తిగతంగానో తీసుకున్న నిర్ణయం కాదని, తెలంగాణ ప్రజల ఆకాంక్షలను గౌరవించి తీసుకున్న నిర్ణయమన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజల ఆకాంక్షలను అణచివేసిందని మంత్రి పొన్నం పేర్కొన్నారు. టీఎస్ అయితేంది?.. అని విమర్శిస్తున్నారు కానీ.. ఆనాడు ఎందుకు మార్చాల్సి వచ్చిందో చెప్పాలని ప్రశ్నించారు. గెజిట్ వచ్చిన తర్వాత టీఎస్‌గా ఎందుకు మార్చారో చెప్పాలన్నారు. టీజీ పేరున 0001 నుంచి నెంబర్ల ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. గతంలో టీఎస్‌తో రిజిస్ట్రేషన్ అయిన వాహనాల నెంబర్లు అలాగే ఉంటాయన్నారు. తెలంగాణ తల్లి విగ్రహంలో మార్పు, తెలంగాణ గీతం విషయంలో కూడా ప్రభుత్వం ఆలోచన చేస్తోందని మంత్రి స్పష్టం చేశారు.

రవాణా వ్యవస్థను పకడ్బందీ చేస్తాం..

ఇటీవల జరుగుతున్న వీఐపీ వాహనాల ప్రమాదాల నేపథ్యంలో ప్రతీ వీఐపీ, హెవీ వెహికల్ డ్రైవర్లకు ఫిట్‌నెస్ టెస్టులు చేయిస్తామని మంత్రి ప్రభాకర్ తెలిపారు. విదేశాల్లో మాదిరిగా డ్రైవింగ్ లైసెన్స్ జారీ ప్రక్రియలో మార్పులు, చేర్పులు చేసి రవాణా వ్యవస్థను పకడ్బందీ చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, అడిషనల్ కలెక్టర్లు రాధికా గుప్తా, వెంకట్‌రెడ్డి, రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే సుధాకర్‌రావు అంత్యక్రియలు పూర్తి

కడసారి చూపునకు భారీగా తరలొచ్చిన అభిమానులు

నివాళులర్పించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు



6లో

సుధాకర్‌రావు భౌతికకాయం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

రిజిస్ట్రేషన్ల శాఖలో..
అక్రమాల పర్వం!

- నిబంధనలకు విరుద్ధంగా క్రయవిక్రయాలు
- ఉమ్మడి జిల్లాలో డాక్యుమెంట్ రైటర్లదే హవా
- ఫీజు టూ ఫీజు పేరిట వసూళ్లు
- స్లాట్ లేకుండానే వ్యవహారం నడిపిస్తున్న వైనం
- మధ్యవర్తులతో దందా కొనసాగిస్తున్న కొందరు అధికారులు



హనుమకొండలోని జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయం

రాంనగర్(హనుమకొండ), మార్చి 14: ఉమ్మడి జిల్లా పరిధిలోని రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయాల్లో అక్రమాల పర్వం కొనసాగుతోందని, భూములు, ఆస్తుల క్రయ విక్రయాలకు సంబంధించిన ప్రక్రియలో నిబంధనలకు తిలోదకాలిస్తున్నారన్న విమర్శలున్నాయి. ఆస్తుల రేట్ల ఆధారంగా వసూళ్ల పర్వం కొనసాగుతోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కార్యాలయాల్లో పని జరగాలంటే ప్రైవేటు వ్యక్తులను ఆశ్రయించాల్సిన దుస్థితి ఏర్పడిందని, నేరుగా వెళితే పనులు జరుగవని ప్రజలు బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కొన్ని కార్యాలయాల్లో అధికారులు ప్రైవేటు వ్యక్తులను నియమించుకుని మరీ దందా సాగిస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

డాక్యుమెంట్ రైటర్స్ హవా..

ఉమ్మడి జిల్లాలో హనుమకొండలోని జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయంతో పాటు మరో 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. ప్రతీ కార్యాలయ పరిధిలో పదుల సంఖ్యలో డాక్యుమెంట్ రైటర్స్ ఉంటారు. ప్రతీ కార్యాలయంలో ఒకరిద్దరు డాక్యుమెంట్ రైటర్స్ ఆడిందే ఆట పాడిందే పాటగా ఉంటోందన్న ఆరోపణలున్నాయి. కొందరు డాక్యుమెంట్ రైటర్లు అధికారులకు సన్నిహితంగా ఉంటూ క్రయవిక్రయాల్లో కీలకపాత్ర పోషించి పెద్దఎత్తున కూడబెట్టుకున్నట్లు తెలిసింది. ఉమ్మడి జిల్లా పరిధిలోని 13 కార్యాలయాల్లో 2వేల మందికిపైగా డాక్యుమెంట్ రైటర్స్ ఉండగా, హనుమకొండలోని జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయంలో 250మందికి పైగా ఉంటారు. కొందరు రైటర్స్ ఆస్తుల విలువ ప్రకారం క్రయవిక్రయదారులతో బేరసారాలు నడిపి అధికారులతో పని కానిచ్చేస్తున్నారని సమాచారం. ఈ క్రమంలో ఫీజు టూ ఫీజు పేరిట వసూళ్లు చేస్తుంటారని, అధికారులు తమవద్దకు వచ్చిన ప్రతీ డాక్యుమెంట్‌ను పరిశీలించి అది ఏ రైటర్ నుంచి వచ్చిందో నోట్ చేసుకుని సాయంత్రం వసూళ్లు చేస్తారని సమాచారం. వారు ప్రత్యేకంగా నియమించుకున్న ప్రైవేటు వ్యక్తి సాయంత్రం డాక్యుమెంట్ రైటర్ వద్దకు వెళ్లి ఆయన పరిధిలో చేసిన డాక్యుమెంట్ల సంఖ్య ఆధారంగా వసూలు చేస్తాడని తెలిసింది. ప్రతీ డాక్యుమెంట్‌కు రూ.2వేల చొప్పున, ఏదైనా సమస్య ఉంటే అదనంగా తీసుకుంటారన్నది బహిరంగ సత్యమేనన్న అభిప్రాయాలున్నాయి. ఇక నగరం పరిధిలోని కార్యాలయాల్లో అయితే ఈ వసూళ్లు లక్షల్లో ఉంటాయనే ప్రచారం ఉంది. కొంతమంది డాక్యుమెంట్ రైటర్లయితే అత్యాశతో అధికారులను ప్రలోభాలకు గురిచేసి అక్రమ రిజిస్ట్రేషన్లు చేసి పట్టుబడిన సంఘటనలున్నాయి. వరంగల్‌లోని ఒక రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఒక డాక్యుమెంట్ రైటర్ సంబంధిత కార్యాలయ అధికారులకు ముడుపులు చెల్లించి అక్రమ రిజిస్ట్రేషన్ చేసి బలైన విషయం తెలిసిందే. ఈ సంఘటనలో అధికారులు సస్పెండ్ కాగా, సదరు డాక్యుమెంట్ రైటర్ జైలుకు వెళ్లారు. కొద్ది నెలల కిందట జరిగిన ఈ సంఘటన ఆ శాఖలో ప్రకంపనలు సృష్టించింది. ఇదిలాఉంటే కొంతమంది డాక్యుమెంట్ రైటర్లు విచ్చలవిడిగా సంపాదించి ప్రజాప్రతినిధులకు సన్నిహితంగా ఉంటూ అధికారులపై పెత్తనం చేసే స్థాయికి చేరుకున్నారంటే వారి హవా ఏమేరకు ఉందో అర్థం చేసుకోవచ్చు.

స్లాట్ లేకుండానే రిజిస్ట్రేషన్

వాస్తవానికి స్లాట్ బుక్ చేసుకున్నవారికి మాత్రమే రిజిస్ట్రేషన్ చేయాలనే నిబంధన పెట్టింది ప్రభుత్వం. క్రయవిక్రయదారులు ముందస్తుగా స్లాట్‌బుక్ చేసుకుంటే తేదీ, సమయం వస్తుంది. దీని ఆధారంగా క్రయవిక్రయదారులు కార్యాలయం చేరుకుని రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసుకోవాల్సి ఉంటుంది. కానీ కార్యాలయాల్లో దీనికి భిన్నంగా జరుగుతోంది. ప్రతీ సబ్ రిజిస్ట్రార్ రోజుకు 36స్లాట్ బుకింగ్ రిజిస్ట్రేషన్లు చేస్తారు. ఇంతకు మించి స్లాట్ బుకింగ్ ఉండదు. జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లు ఉండటంతో ఒక్కొక్కరికి 36 చొప్పున ఇద్దరికి 72రిజిస్ట్రేషన్లు

మిగతా 6వ పేజీలో...

డీఎస్సీ ఉచిత కోచింగ్‌కు దరఖాస్తులు

కేయూ క్యాంపస్, మార్చి 14: జిల్లా షెడ్యూల్ కులాల అధ్యయన, అభివృద్ధి సంస్థల నేతృత్వంలో రెండు నెలల పాటు 100 మంది నిరుద్యోగ యువతకు ఉచిత వసతితో కూడిన శిక్షణ ఇచ్చేందుకుగాను ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఎస్సీ స్టడీ సర్కిల్ ఉమ్మడి వరంగల్ జిల్లా గౌరవ సంచాలకుడు డాక్టర్ కె.జగన్‌మోహన్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఏప్రిల్ 3 నుంచి జూన్ 2 వరకు శిక్షణ ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు బీఎడ్, డైట్, టెట్ ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు http://tsstudycircle.-co.in/ వెబ్‌సైట్‌లో మార్చి 24 వరకు దరఖాస్తులు సమర్పించాలని కోరారు.

బీసీ విద్యార్థులకు ఉచిత శిక్షణ

హనుమకొండ కలెక్టరేట్, మార్చి 14: హైదరాబాద్ స్కూల్ ఆఫ్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ద్వారా హైదరాబాద్‌లో బీసీ విద్యార్థులకు బ్యాంకింగ్, ఫైనాన్స్‌లో రెండు నెలలు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ ఎంపీపీ ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్, హనుమకొండ, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, జనగామ, ములుగు జిల్లాలకు చెందిన అర్హులైన నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 0870-2571192, 040-29303130 నెంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

అంగన్‌వాడీ మండల కమిటీ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

కాజీపేట, మార్చి 14 : తెలంగాణ అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ కాజీపేట మండల నూతన కమిటీ గురువారం ఎన్నిక జరిగింది. అధ్యక్షురాలుగా కె.రమాదేవి, కార్యదర్శిగా ఎం.కవిత, కోశాధికారిగా పి.శారద, ఉపాధ్యక్షురాలుగా ఎం. అరుణ, టి.శ్రీదేవి, సహాయ కార్యదర్శిగా డి.లలిత ఎన్నికయ్యారు. అంతకు ముందు సో మిడి సెక్టార్ లీడర్లుగా ఎం.కవిత, డి.బాలశ్రీ, పి.రఘుకుమారి, మడికొండ సెక్టార్‌కు పి.వెంకటలక్ష్మి, పి.శారద, కె.రాజ్యలక్ష్మి, దర్గా సెక్టార్‌కు టి.జ్ఞానసుందరి, ఎం. అరుణ, కె.రజనీలను ఎన్నుకున్నారు.

16న నిరుద్యోగ యువతకు జాబ్ మేళా

వరంగల్ క్రైం, మార్చి 14: వరంగల్ కమిషనరేట్ పోలీసుల ఆధ్వర్యంలో ఈ నెల 16న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. టీయంబి ఫౌండేషన్ సహకారంతో నిర్వహిస్తున్న జాబ్‌మేళాను కమిషనరేట్ పరిధిలోని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని సీపీ సూచించారు. హనుమకొండలోని కాకతీయ డిగ్రీ కళాశాలలో ఉదయం 10గంటలకు ప్రారంభమయ్యే జాబ్ మేళాలో 3వేలకు పైగా ప్రముఖ కంపెనీలు ఉద్యోగ నియామకాలు చేపడతాయన్నారు. జాబ్‌మేళాకు హాజరయ్యే యువత.. కనీసం 10వతరగతి పూర్తి చేసి ఉండాలన్నారు. జాబ్ మేళాకు హాజరయ్యే యువత ముందస్తుగా సంబంధిత వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అంబర్ కిషోర్ ఝా సూచించారు.

బీఆర్ఎస్, బీఎస్పీ పొత్తు.. రహస్యమేంటి?

- ఇమడలేకనే బీఆర్ఎస్ వీడుతున్నా: కోనేరు కోనప్ప
- మంత్రి సీతక్క సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక



కాగజ్‌నగర్, మార్చి 14: బీఆర్ఎస్, బీఎస్పీతో పొత్తుపెట్టుకోవటం వెనుక రహస్య ఒప్పందం ఏంటని మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికల్లో తనపై లేనిపోని ఆరోపణలు చేసి ఓడించిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌తో బీఆర్ఎస్ జత కట్టడం ఇమడలేకనే ఆ పార్టీని వీడుతున్నట్టు ప్రకటించారు. గురువారం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క సమక్షంలో కోనప్ప కాంగ్రెస్‌లో చేరారు. ఆయనతో పాటు జెడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు, మునిసిపల్ చైర్‌పర్సన్ షహీన్ సుల్తానా, వైస్ చైర్మన్ రాజేందర్‌తోపాటు పలువురు ఎంపీపీలు, జెడ్పీటీసీలు కూడా కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా కోనప్ప మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్‌పై తనకు ఎలాంటి కోపం లేదన్నారు. తనకు ఎలాంటి పదవులు వద్దని, కేవలం సిర్పూరు నియోజకవర్గ అభివృద్ధి చాలని వ్యాఖ్యానించారు. అనంతరం సీతక్క మాట్లాడుతూ.. సిర్పూరు నియోజవర్గ సమస్యలను తప్పకుండా పరిష్కరిస్తామని హామీనిచ్చారు.

బీఆర్ఎస్‌కు పెద్దిరెడ్డి రాజీనామా

హుజూరాబాద్, హైదరాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి తరువాత కీలక నేతలు పార్టీని వీడుతున్నారు. తాజాగా కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ నియోజకవర్గానికి చెందిన మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి పార్టీకి రాజీనామా చేశారు. తన ఆత్మగౌరవం దెబ్బతినే విధంగా అధిష్ఠానం వ్యవహార శైలి ఉందని, అది నచ్చకనే పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నానని ఆయన తెలిపారు. ఈ మేరకు గురువారం రాజీనామా లేఖను మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పంపించారు. పార్టీ సంస్థాగత నిర్మాణం, రాజకీయాలపై సుదీర్ఘ అనుభవం కలిగిన తనకు పార్టీలో సముచిత గౌరవం లభించలేదని పెద్దిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కార్యకర్తలు, అభిమానులతో మాట్లాడి భవిష్యత్తు కార్యాచరణను త్వరలోనే ప్రకటిస్తానన్నారు. కాగా ఆయన అధికార కాంగ్రెస్‌లో చేరతారని సమాచారం.

ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో ముగ్గురు

మహబూబ్‌నగర్, మార్చి14: మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు నామినేషన్ల ఉపసంహరణ గడువు గురువారంతో ముగిసింది. ఉపసంహరణ గడువు ముగిసే సమయానికి ముగ్గురు అభ్యర్థులు మాత్రమే పోటీలో నిలిచారు. మొత్తం 16మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. పరిశీలనలో ముగ్గురి దరఖాస్తులను అధికారులు తిరస్కరించారు. 10 మంది అభ్యర్థులు నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. కాంగ్రెస్ నుంచి మన్నె జీవన్ రెడ్డి, బీఆర్ఎస్ నుంచి నవీన్‌కుమార్ రెడ్డి, స్వతంత్ర అభ్యర్థి సుదర్శన్‌గౌడ్ బరిలో నిలిచారు. 28న ఎన్నిక జరగనుంది.

మంత్రి కోమటిరెడ్డిని కలిసిన జానారెడ్డి

- రఘువీర్‌రెడ్డి విజయానికి సహకరించాలని విజ్ఞప్తి

హైదరాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో నల్లగొండ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేస్తున్న రఘువీర్‌రెడ్డి విజయం కోసం సహకరించాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని మాజీ మంత్రి జానారెడ్డి కోరారు. గురువారం బంజారాహిల్స్‌లోని మంత్రి నివాసానికి వెళ్లిన జానారెడ్డి తన కుమారుడు రఘువీర్‌రెడ్డిని ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. మూడు దశాబ్దాలుగా రాజకీయాల్లో తమ మధ్య ఉన్న అనుబంధాన్ని ఇరువురు నేతలు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. రఘువీర్‌కు తన సంపూర్ణ మద్దతు ఉంటుందని, ఆయన్ను భారీ మెజార్టీతో గెలిపించుకుందామని మంత్రి కోమటిరెడ్డి హామీ ఇచ్చారు.

ఆటోడ్రైవర్ల సమస్యలపై నిర్లక్ష్యం వీడాలి: హరీశ్

హైదరాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్ల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలని ఎమ్మెల్యే హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఆటో నడవడం లేదని మనస్తాపంతో నిజామాబాద్‌లో ఓ సోదరుడు తన భార్యతో సహా ప్రాణాలు తీసుకున్న హృదయ విదారక ఘటన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కదిలించకపోవడం బాధాకరమని గురువారం ఎక్స్(ట్విటర్) వేదికగా ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులను కోల్పోయి అనాధగా మారిన వారి బిడ్డ భవిష్యత్‌కు ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. ఆ కుటుంబానికి వెంటనే రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలన్నారు. అలాగే ఆటోడ్రైవర్ల జీవనసమస్యకు పరిష్కారం చూపాలని, వారికి రూ.12వేల భృతి ఇవ్వాలని హరీష్‌రావు కోరారు. కాగా, డీఎస్సీ పరీక్షలకు ముందే టెట్ నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించడం సంతోషకరమని మరో ట్వీట్‌లో హరీశ్ పేర్కొన్నారు.

డీకే శివకుమార్‌ను కలిసిన మల్లారెడ్డి

తనయుడితో కలిసి బెంగళూరుకు.. కర్ణాటక డిప్యూటీ సీఎంతో భేటీ

పార్టీ మారుతున్నారనే ఊహాగానాలు.. వ్యాపార లావాదేవీలేనన్న మల్లారెడ్డి

హైదరాబాద్/మేడ్చల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి గురువారం బెంగళూరులోని ఒక హోటల్లో కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు కలిశారు. మల్లారెడ్డి తనయుడు భద్రారెడ్డి కూడా వెంట ఉన్నారు. బీఆర్ఎస్ నుంచి పలువురు నేతలు కాంగ్రెస్‌లోకి చేరుతున్న నేపథ్యంలో మల్లారెడ్డి భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. శుక్రవారం ఢిల్లీలో కాంగ్రెస్ ముఖ్యనేత ప్రియాంకగాంధీని కలిసేందుకు అవకాశం ఇప్పించమని మల్లారెడ్డి కుటుంబసభ్యులు డీకేను కోరినట్లు సమాచారం. గత వారమే మల్లారెడ్డి, అల్లుడు మర్రి రాజశేఖర్‌రెడ్డితో కలిసి సీఎం సలహాదారు అయిన వేంనరేందర్‌రెడ్డితో భేటీ అయ్యారు. అప్పుడే ఇద్దరు ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని ప్రచారం జరిగింది. దాంతో కేటీఆర్ మల్లారెడ్డిని తన నివాసానికి పిలిపించుకుని మాట్లాడారు. తనకు కాంగ్రెస్‌లోకి వెళ్లే ఆలోచన లేదని మల్లారెడ్డి కేటీఆర్‌కు చెప్పారు. ఆ మాట చెప్పి వారం గడవక ముందే డీకే శివకుమార్‌తో భేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. పార్టీ మారుతున్నట్లు వచ్చిన ఆరోపణలను మల్లారెడ్డి ఖండించారు. తాను బీఆర్ఎస్‌లోనే కొనసాగుతానన్నారు. బెంగళూరుకు ఒక ఫంక్షన్‌కు వచ్చానని, అక్కడ ఒక ప్రైవేటు వర్సిటీ అమ్మకానికి ఉందని ఫ్రెండ్ చెబితే దాని కొనుగోలు గురించి మాట్లాడటానికి మధ్యవర్తి ద్వారా డీకే శివకుమార్‌ను కలిశానని తెలిపారు. , రాజకీయాలేవీ మాట్లాడలేదన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి 75 ఏళ్లు దాటుతాయని, ఆ ఎన్నికల్లో పోటీచేసే ఉద్దేశం తనకు లేదని స్పష్టం చేశారు. ఈ ఐదేళ్లు బీఆర్ఎస్‌లోనే ఉంటూ ఎమ్మెల్యేగా ప్రజలకు సేవ చేస్తానని చెప్పారు. మల్లారెడ్డి డీకే శివకుమార్ దగ్గరే ఆగిపోకుండా ప్రియాంకగాంధీ అపాయింట్‌మెంట్ అడగడం ఊహాగానాలకు తావిస్తోంది. ఆస్తులను కాపాడుకోవడానికి కాంగ్రెస్‌లోకి వెళ్లడమే మార్గమని మల్లారెడ్డి భావిస్తున్నారని కాంగ్రెస్‌లోని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. మల్లారెడ్డి రాకను మేడ్చల్ కాంగ్రెస్ నేతలు మైనంపల్లి హన్మంతరావు, సుధీర్ రెడ్డి, వజ్రేష్‌యాదవ్, హరివర్ధన్‌రెడ్డి, నక్క ప్రభాకర్ గౌడ్ వ్యతిరేకిస్తున్నారు. రేవంత్ సన్నిహితుడిని కలిసినా చేరిక పని కాకపోవడంతో మల్లారెడ్డి బెంగుళూరు వైపు నుంచి నరుక్కొస్తున్నారని భావిస్తున్నారు.

ఆపరేషన్ రేవంత్!

(మొదటిపేజీ తరువాయి)

తెలుస్తోంది. రేవంత్ ఆయన సహచర బృందం కదలికలను గుర్తించడంతో పాటు ఎన్నికల్లో కాంగ్రెస్‌కు డబ్బులు ఎక్కడినుంచి, ఏయే మార్గాల్లో, ఎవరెవరు సర్దుబాటు చేస్తున్నారు..? అనే వివరాలను ప్రణీత్ ట్యాపింగ్ చేశారు. ముఖ్యంగా ఎన్నికలకు కొద్ది నెలల ముందు నుంచి రేవంత్‌తో పాటు ఆయనకు అత్యంత సన్నిహితులు, సహకరించే అందరి ఫోన్‌లపైనా ట్యాపింగ్ కొనసాగినట్లు ఆధారాలు లభించినట్లు తెలిసింది. అప్పటి అధికార పార్టీ బీఆర్ఎస్ ఆదేశాల మేరకు నడుచుకున్న ప్రణీత్.. రాజకీయ నాయకులు, పోలీసులతో పాటు ప్రైవేటు వ్యక్తుల సహకారం కూడా తీసుకున్నారు. ఎక్కడికక్కడ తమకు అందుతున్న సమాచారం, ఫోన్ నంబర్ల ఆధారంగా ఎస్ఐబీ ప్రధాన కార్యాలయం, ఇతర వార్ రూంల నుంచి రోజుల వ్యవధిలోనే వందల ఫోన్‌ల ట్యాపింగ్‌కు పాల్పడ్డారు. హార్డ్ డిస్క్‌ల ధ్వంసం, కీలక పత్రాల దహనం కేసు దర్యాప్తులో భాగంగా ప్రణీత్ ఫోన్‌లోని వాట్సాప్ చాటింగ్‌లను దర్యాప్తు అధికారులు పరిశీలించగా బీఆర్ఎస్ నేతలతో పాటు ప్రైవేటు వ్యక్తుల నుంచి వచ్చిన సందేశాలను పరిశీలించారు. ఎన్నికల్లో డబ్బులు ఎవరెవరి చేతులు మారుతున్నాయన్న సమాచారం గుర్తించి కట్టడి చేశారని స్పష్టమైంది. అరెస్టు సమయంలో ప్రణీత్‌రావును ప్రాథమికంగా విచారించగా ఒక ఎస్పీ, ఎస్ఐబీ అప్పటి చీఫ్ ఆదేశాల మేరకే తాను, తన బృందం పనిచేసినట్లు వెల్లడించినట్లు తెలిసింది. ప్రణీత్‌ను కస్టడీకి తీసుకుని విచారించేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారు. ఏడు రోజుల కస్టడీ



ప్రణీత్‌రావు (ఫైల్)

కోరుతూ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కాగా, ప్రణీత్‌రావు కేసుకు సంబంధించి ఇప్పటివరకు జరిగిన దర్యాప్తుపై సీఎం రేవంత్ పోలీసు ఉన్నతాధికారుల నుంచి ఆరా తీసినట్లు సమాచారం. దీంతో వారు సమగ్ర నివేదిక అందించారని తెలిసింది. ప్రణీత్ వ్యవహారంలో వెలుగులోకి వచ్చిన వ్యక్తుల పేర్లు.. అనుసరించాల్సిన విధానాలపై సీఎంకు వివరించినట్లు సమాచారం. చట్ట వ్యతిరేకంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకోవాలని సీఎం స్పష్టం చేసినట్లు తెలిసింది.

ఉన్నతాధికారుల చుట్టూ ఉచ్చు

ప్రణీత్‌తో అంటకాగి కుట్రలో భాగస్వాములైన ఎస్ఐబీ అప్పటి ఉన్నతాధికారులను నేడో రేపో విచారించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. పంజాగుట్ట పోలీసులు వారికి నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. ఎన్నికల ముందు పనిచేసినవారిపై దృష్టిపెట్టినట్లు సమాచారం. కొన్ని నియోజకవర్గాల్లో అధికారులు వారి ఇళ్లలోనే ప్రత్యేక గదుల్లో (వార్ రూమ్‌లు) ఏర్పాట్లు చేసి, ట్యాపింగ్‌కు పాల్పడినట్లు గుర్తించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వీటిని సిద్ధం చేసిన ప్రణీత్‌కు పలువురు సహచరులూ సహకరించినట్లు తెలుస్తోంది. మూడు నియోజకవర్గాల్లో విజిలెన్స్‌లో పనిచేస్తున్న ఇద్దరు, ఎస్ఐబీ అధికారి ఇళ్లలో వార్ రూమ్‌లను ఏర్పాటు చేసి, ప్రముఖుల ఫోన్‌లను ట్యాప్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఎన్నికల సందర్భంగా ఓ పార్టీ నిధుల తరలింపులోనూ ప్రణీత్ కీలక పాత్ర పోషించారని అనుమానిస్తున్నారు. డబ్బు, బంగారం, వస్తువులను చేరవేసేందుకు సొంత, ఎస్ఐబీ, గ్రేహౌండ్స్ వాహనాలను వినియోగించారనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు. ప్రణీత్ ఫోన్ నుంచి కీలక వివరాలు సేకరించే పనిలో సైబర్ నిపుణులు ఉన్నారు. ఆయన తొలగించిన డేటాను రిట్రీవ్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇది బయటకు వస్తే మరింతమంది అరెస్టయ్యే అవకాశముందని చెబుతున్నారు. ఇప్పటికే ఎస్ఐబీ లాగర్ రూమ్‌లో పనిచేసిన ఇన్‌స్పెక్టర్, ఎస్సైలను విచారించారు.

ట్యాపింగ్ చేయమన్నది ఎవరు?

ట్యాపింగ్‌కు ఎవరు ప్రోత్సహించారు? ఎలాంటి సమాచారం సేకరించారు? ఎవరి పాత్ర ఎంత? అనే ప్రశ్నలకు ప్రవీణ్ స్పష్టంగా సమాధానం ఇచ్చారని తెలుస్తోంది. ఈ మేరకు పంజాగుట్ట పోలీసులు స్టేట్‌మెంట్ రికార్డు చేసి, సాంకేతిక ఆధారాలను సేకరించారు. ప్రణీత్ ఫోన్ డేటా విశ్లేషించి, ఏయే నంబర్లతో ఎంత మందితో టచ్‌లో ఉన్నారో తెలుసుకున్నారు. ఎవరెవరి ఫోన్‌లు ఎంత కాలం ట్యాప్ చేశారు? తదితర అంశాలను దర్యాప్తు చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వార్ రూమ్‌లకు ఈ డేటాను అందించినట్లు అంచనాకు వచ్చారు. డేటాను కాపీ చేసిన హార్డ్ డిస్క్‌లు ఎక్కడున్నాయో దర్యాప్తు చేస్తున్నారు.

ప్రత్యేక బ్యారెక్.. పకడ్బందీ భద్రత

ప్రణీత్‌ను విచారించి ఆధారాలు, సమాచారం రాబట్టేందుకు కస్టడీకి ఇవ్వాలని కోరుతూ గురువారం నాంపల్లి కోర్టులో పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని ప్రణీత్ న్యాయవాదులకు జడ్జి సూచించారు. శుక్రవారం వాదనలు జరిగే అవకాశముంది. కాగా, పోలీసుల అదుపులో ఉన్న ఆయనను బుధవారం రాత్రి చంచల్‌గూడ జైలుకు రిమాండ్‌కు తరలించారు. ప్రణీత్‌ను భద్రతా కారణాల దృష్ట్యా ప్రత్యేక బ్యారెక్‌లో ఉంచారు. సీసీ కెమెరా నిఘాతో పాటు నిరంతరం జైలు సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు. అటువైపుగా ఇతర ఖైదీలను అనుమతించడం లేదు. గురువారం ఉదయం ప్రణీత్ తరపు న్యాయవాది అనుదీప్, సోదరుడు వంశీ ములాఖాత్ అయ్యారు.

కాంగ్రెస్‌లోకి జితేందర్‌రెడ్డి!

(మొదటిపేజీ తరువాయి)

సీఎం రేవంత్‌రెడ్డి గురువారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి జితేందర్ నివాసానికి వెళ్లి అరగంట పాటు సమావేశమయ్యారు. ఇది జితేందర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరబోతున్నారన్న ప్రచారానికి మరింత ఊతమిచ్చినట్లైంది. మరోవైపు ఈ పరిణామం మహబూబ్‌నగర్ జిల్లాలోనూ కలకలం రేపింది. సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవలి వరకు ప్రాతినిధ్యం వహించిన మల్కాజిగిరిలో కాంగ్రెస్ నుంచి జితేందర్‌రెడ్డి పోటీ చేస్తారని పెద్దఎత్తున చర్చ జరిగింది. ఇక గురువారం సాయత్రం మహబూబ్‌నగర్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావు మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. సీఎం వెళ్లి కలిశారంటేనే పార్టీలోకి ఆహ్వానించడానికి కాదా? అని వ్యాఖ్యానించారు. జితేందర్‌రెడ్డి మనస్తత్వం తనకు తెలుసని, ఎంపీగా రాష్ట్ర సమస్యల పరిష్కారానికి కృషి చేశారని పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి పనిచేస్తే బీజేపీ మోసం చేసిందని ఆరోపించారు.

ఎన్నికల్లో పోటీ చేయను..

తాను ఎన్నికల్లో పోటీ చేయడం లేదని జితేందర్‌రెడ్డి 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. రేవంత్‌తోనూ ఎన్నికల్లో పోటీపై చర్చించలేదని స్పష్టంచేశారు. నిత్యం ప్రజల్లో ఉండే తనకు బీజేపీ టికెట్ రాకపోవడంతో సీఎం బాధపడ్డారని చెప్పారు. 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనం చూసి రేవంత్‌రెడ్డి వచ్చినట్లు చెప్పారు. తన భవిష్యత్తును పార్టీ అధినాయకత్వమే చూసుకుంటుందని చెప్పారు. కాగా, జితేందర్‌రెడ్డికి ప్రధాని మోదీ, అమిత్‌షాతో సన్నిహిత సంబంధాలున్నాయి. అయితే, తనకు టికెట్ రాలేదని తెలిసి ఓదార్చేందుకే.. సొంత జిల్లా వాసి అయిన రేవంత్ వచ్చి కలిశారని చెప్పినా మహబూబ్‌నగర్ బీజేపీ, కాంగ్రెస్ వర్గాల్లో మాత్రం పార్టీ మార్పు ఊహాగానాలు పెద్దఎత్తున సాగాయి.

అరుణ ప్రెస్‌మీట్‌లో జితేందర్ కుమారుడు

మహబూబ్‌నగర్ బీజేపీ అభ్యర్థిగా డీకే అరుణ పేరును ప్రకటించాక జితేందర్‌రెడ్డి కుమారుడు మిథున్‌రెడ్డి ఆమె నివాసానికి వెళ్లి అభినందలు తెలిపారు. గురువారం జితేందర్ రెడ్డి నివాసానికి సీఎం రేవంత్ వెళతారని ప్రచారం జరుగుతున్న సమయంలోనే పాలమూరులో అరుణ మీడియా సమావేశం నిర్వహించారు. ఇందులోనూ మిథున్‌రెడ్డి పాల్గొనడం గమనార్హం.

నేడు హైదరాబాద్‌కు ప్రధాని మోదీ

(మొదటిపేజీ తరువాయి)

పర్యటించనున్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా రెండు రోజుల కిందట వచ్చి, సంస్థాగత బలోపేతంపై రాష్ట్ర పార్టీకి దిశానిర్దేశం చేశారు. బీజేపీ సోషల్ మీడియా వారియర్స్‌తో పాటు పార్టీ పోలింగ్ బూత్ అధ్యక్షులు, ఆ పైస్థాయి క్యాడర్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. బీజేపీ ముఖ్య నేతలతో భేటీ అయి పోలింగ్ బూత్‌ల పటిష్ఠత ఆవశ్యకతను వివరించారు. ఈ క్రమంలో ప్రధాని మోదీ శుక్రవారం మరోసారి రాష్ట్ర పర్యటనకు రానున్నారు. ఆయన మూడు రోజుల పాటు పార్టీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేయనున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు నగరంలో మోదీ రోడ్ షోను నిర్వహించినట్లుగానే ఈసారి కూడా బీజేపీ అదే విధంగా ప్లాన్ చేస్తోంది. మూడు పార్లమెంటు నియోజకవర్గాలకు కలిపి ఒక కేంద్రంలో ప్రధాని ఎన్నికల ప్రచారం కొనసాగించేలా రాష్ట్ర పార్టీ ప్రణాళిక రూపొందించింది. ఇందుకు అనుగుణంగా మల్కాజ్‌గిరి, సికింద్రాబాద్, హైదరాబాద్ సెగ్మెంట్లకు కలిపి శుక్రవారం సాయంత్రం 5 గంటలకు మల్కాజ్‌గిరి పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో జరిగే రోడ్ షోలో మోదీ పాల్గొంటారు. మీర్జాలగూడ నుంచి మల్కాజ్‌గిరి చౌరస్తా 1.3 కి.మీ మేర ఈ రోడ్ షోను భారీ ఎత్తున నిర్వహించేందుకు బీజేపీ ఏర్పాట్లు చేస్తోంది. శుక్రవారం సాయంత్రం 4.50 గంటలకు ప్రధాని ప్రత్యేక విమానంలో బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు. 5 గంటల నుంచి 6 గంటల వరకు రోడ్ షోలో పాల్గొంటారు. మల్కాజ్‌గిరి చౌరస్తాలో ప్రసంగిస్తారు. అనంతరం, ప్రధాని రాజ్‌భవన్‌కు వెళ్లి బస చేస్తారు. శనివారం ఉదయం 11 గంటలకు బయలుదేరి నాగర్‌కర్నూలులో నిర్వహించే బహిరంగ సభకు హాజరవుతారు. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూలు, నల్లగొండ పార్లమెంటు నియోజకవర్గాలకు సంబంధించి ఈ సభను ఏర్పాటుచేశారు. అనంతరం గుల్బర్గా బయలుదేరి వెళతారు. తిరిగి 18న జగిత్యాలలో నిర్వహించే బహిరంగ సభలో ప్రధాని పాల్గొంటారు. కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ సెగ్మెంట్లకు సంబంధించి ఈ సభను ఏర్పాటు చేసినట్లు బీజేపీ వర్గాలు వివరించాయి.

రేవంత్‌కు అభద్రతా భావమెందుకు?: లక్ష్మణ్

కాంగ్రెస్‌కు మెజారిటీ ఎమ్మెల్యేలు ఉన్నప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు అభద్రతా భావంతో మాట్లాడుతున్నారని ఎంపీ లక్ష్మణ్ ప్రశ్నించారు. ఎంపీ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కారు ఏర్పాటుకు మార్గం సుగమమవుతుందని చెప్పారు. ఈ ప్రభుత్వం ఐదేళ్లు కొనసాగాలనే కోరుకుంటున్నామని.. కానీ నిలబెట్టుకోలేకపోతే వారి కర్మ అని అన్నారు. రాష్ట్రంలో 12కు పైగా స్థానాల్లో బీజేపీ విజయం ఖాయమని మాజీ ఎంపీ, చేవెళ్ల అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ ఓటమికి, ఆ పార్టీ పతనానికి అహంకారమే కారణమని మాజీ ఎంపీ, బీజేపీ మహబూబాబాద్ లోక్‌సభ అభ్యర్థి సీతారాం ఢిల్లీలో విమర్శించారు. ప్రజలే ఆ అహంకారాన్ని అణచివేశారని తెలిపారు.

పలు ప్రాజెక్టులకు అనుమతులు

హైదరాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వివిధ ప్రాజెక్టుల నిర్మాణాలకు పరిపాలనపర అనుమతులు ఇస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఖమ్మం జిల్లాలో మున్నేరు వాగుపై రూ.107.30 కోట్లతో ఆనకట్ట, నాగార్జున సాగర్ ఎడమకాలువపై రూ.35.75 కోట్లతో కొడుమూరు ఎత్తిపోతల పథకం రెండో దశ, కరీంనగర్ జిల్లాలోని కలువల వాగుపై చెక్‌డ్యామ్ నిర్మాణానికి అనుమతి ఇచ్చింది.

తెలంగాణలో కాంగ్రెస్‌దే హవా!

17 లోక్‌సభ స్థానాల్లో 10 ఆ పార్టీ ఖాతాలోకే.. బీజేపీ-4, బీఆర్ఎస్-2, మజ్లిస్-1

- ఏపీలో టీడీపీ కూటమికి ఘన విజయం
- 25 సీట్లలో 20 గెల్చుకునే అవకాశం
- ఉత్తరాదిన మళ్లీ బీజేపీ ప్రభంజనం
- పలు రాష్ట్రాల్లో కమలం క్లీన్ స్వీప్!
- ఏబీపీ-సీఓటర్ సర్వే అంచనాలు
- తెలంగాణలో బీజేపీ 8 సీట్లు

గెలుస్తుందని నెట్‌వర్క్ 18 సర్వే వెల్లడి



న్యూఢిల్లీ, మార్చి 14: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ 10 స్థానాలను కైవసం చేసుకోనుందని ఏబీపీ- సీ ఓటర్ ఒపీనియన్ పోల్ అంచనా వేసింది. మొత్తం 17 స్థానాల్లో బీజేపీ 4, బీఆర్ఎస్ 2, ఎంఐఎం 1 స్థానం గెలవవచ్చని పేర్కొంది. కాగా, ఓట్ల విషయానికొస్తే.. కాంగ్రెస్ 43 శాతం, బీఆర్ఎస్ 28 శాతం, బీజేపీ 25 శాతం, ఎంఐఎం ఒక శాతం ఓట్లను దక్కించుకోవచ్చని ఈ సర్వే తెలిపింది. ఏపీలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి, వైసీపీ, కాంగ్రెస్‌ల మధ్య త్రిముఖ పోరు ఉంటుందని ఈ సర్వే వెల్లడించింది. మొత్తం 25 సీట్లలో టీడీపీ కూటమి 20 సీట్లను తమ ఖాతాలో వేసుకుంటుందని, వైసీపీ కేవలం 5 స్థానాలకే పరిమితమవుతుందని పేర్కొంది. ఓట్ల పరంగా కూటమికి 45 శాతం, వైసీపీకి 42 శాతం, కాంగ్రెస్‌కు 3 శాతం ఓట్లు లభిస్తాయని తెలియజేసింది. ఇతర రాష్ట్రాల విషయానికొస్తే ఈ సర్వే వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి.


తమిళనాడులో డీఎంకే-కాంగ్రెస్ స్వీప్

కర్ణాటకలో బీజేపీ-జేడీఎస్ కూటమి 23 సీట్లను, కాంగ్రెస్ ఐదు సీట్లను దక్కించుకుంటాయి. తమిళనాడులో మొత్తం 39 సీట్లనూ డీఎంకే-కాంగ్రెస్ కూటమి స్వీప్ చేయనుంది. కేరళలో ఉన్న 20 సీట్లలో 16 సీట్లు కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ గెల్చుకోనుంది. మిగిలిన నాలుగు సీట్లు వామపక్ష (ఎల్‌డీఎఫ్) కూటమి కైవసం చేసుకుంటుంది. బీజేపీకి ఒక్క స్థానం కూడా దక్కే అవకాశం లేదు. ఇక దేశంలోనే అతిపెద్ద రాష్ట్రం, అత్యధికంగా 80 సీట్లను కలిగి ఉన్న యూపీలో ఈసారి కూడా బీజేపీ హవా వీయనుంది. 74 స్థానాలను ఆ పార్టీ సారథ్యంలోని ఎన్‌డీఏ కైవసం చేసుకుంటుంది. ఎస్పీ-కాంగ్రెస్‌లకు ఆరుకు మించి లభించే అవకాశాల్లేవు. బిహార్‌లో మొత్తం 40 స్థానాలకుగాను ఎన్‌డీఏ కూటమి 32 స్థానాల్లో విజయకేతనం ఎగురవేసే అవకాశం ఉంది. మిగిలిన ఎనిమిది సీట్లకే ఇండియా కూటమి పరిమితం కావచ్చు. పంజాబ్‌లో మొత్తం 13 స్థానాలు ఉండగా, రాష్ట్రంలో అధికారంలో ఉన్న ఆమ్‌ఆద్మీ పార్టీ ఆరు స్థానాలను గెల్చుకునే అవకాశాలున్నాయి. కాంగ్రెస్ 5, బీజేపీ, అకాలీదళ్ చెరో స్థానాన్ని ఖాతాలో వేసుకోవచ్చు. 14 సీట్లున్న జార్ఖండ్‌లో 12 ఎన్‌డీఏ కూటమికి, రెండు ఇండియా కూటమికి లభించవచ్చు. దేశ రాజధాని ఢిల్లీలో మొత్తం ఏడు సీట్లనూ బీజేపీ మరోసారి హస్తగతం చేసుకోనుంది. హరియాణాలో 10 స్థానాలకుగాను బీజేపీ 8, కాంగ్రెస్ 2 స్థానాల్లో విజయం సాధించే అవకాశాలున్నాయి. గుజరాత్ (26), రాజస్థాన్ (25), హిమాచల్ ప్రదేశ్ (4)లను బీజేపీ పూర్తిగా క్లీన్‌స్వీప్ చేయనుంది. ఇక ఈశాన్య రాష్ట్రాల్లో ఉన్న 11 స్థానాల్లో 9 బీజేపీ ఖాతాలోనే పడతాయని ఏబీపీ సీ ఓటర్ సర్వే అంచనా వేసింది. కాగా, నెట్‌వర్క్ 18.. 'మెగా ఒపీనియన్ పోల్' పేరుతో తెలంగాణలో తమ సర్వే వివరాలను గురువారం వెల్లడించింది. ఈ సర్వే ప్రకారం.. రాష్ట్రంలోని 17 సీట్లలో బీజేపీ 8 కైవసం చేసుకుంటుంది. కాంగ్రెస్ 6, బీఆర్ఎస్ 2, ఎంఐఎం ఒక స్థానంలో గెలిచే అవకాశాలున్నాయి. అయితే, ఓట్ల పరంగా కాంగ్రెస్ అత్యధికంగా 34 శాతం ఓట్లను దక్కించుకుంటుందని, బీజేపీకి 28 శాతం, బీఆర్ఎస్‌కు 27 శాతం, ఇతరులకు 11 శాతం ఓట్లు లభిస్తాయని ఈ సర్వే పేర్కొంది.

మల్కాజిగిరిలో రాగిడి లక్ష్మారెడ్డి

ఆదిలాబాద్‌లో ఆత్రం సక్కు.. మరో రెండు ఎంపీ స్థానాలకు బీఆర్ఎస్ అభ్యర్థులను ఖరారు చేసిన కేసీఆర్

హైదరాబాద్, ఆదిలాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో బరిలోకి దిగనున్న మరో ఇద్దరు బీఆర్ఎస్ అభ్యర్థులను ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ గురువారం ప్రకటించారు. మల్కాజిగిరి ఎంపీ స్థానానికి రాగిడి లక్ష్మారెడ్డి, ఆదిలాబాద్ స్థానానికి ఆత్రం సక్కు అభ్యర్థిత్వాలను ఆయన ఖరారు చేశారు. ఇప్పటికే ప్రకటించిన వాటితో కలిపి ఇప్పటి వరకు 11లోక్‌సభ స్థానాలకు బీఆర్ఎస్ తమ అభ్యర్థులను ప్రకటించింది. ఉప్పల్ టికెట్ రాకపోవడంతో రాగిడి లక్ష్మారెడ్డి అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్ఎస్‌లో చేరిన విషయం తెలిసిందే. అయితే మల్కాజిగిరి స్థానం నుంచి పలువురి పేర్లు ప్రచారంలో ఉన్నప్పటికీ అనూహ్యంగా రాగిడి లక్ష్మారెడ్డి అభ్యర్థిత్వాన్ని ప్రకటించడంపై పార్టీ శ్రేణుల్లో చర్చ జరుగుతోంది. ఆదిలాబాద్ పార్లమెంటు నియోజకవర్గానికి సంబంధించిన నేతలతో నందినగర్‌లోని తన నివాసంలో కేసీఆర్ గురువారం భేటీ అయ్యారు. ఆదిలాబాద్‌లో



రాగిడి లక్ష్మారెడ్డి ఆత్రంసక్కు

పార్టీ అభ్యర్థి ఎవరన్నదానిపై నేతలతో కేసీఆర్ సుదీర్ఘంగా చర్చించారు. ఈ క్రమంలో ఆదివాసీ ఉద్యమనేత, ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కుకు టికెట్ ఇవ్వాలని నిర్ణయించారు. సిటింగ్ ఎమ్మెల్యేగా ఉన్న ఆయనకు ఇటీవలి శాసనసభ ఎన్నికల్లో అవకాశం ఇవ్వలేదు. అదేసమయంలో ఆయనకు లోక్‌సభకు అవకాశం ఇస్తామన్న అధినాయకత్వం హామీ మేరకు తాజాగా ఆయన అభ్యర్థిత్వాన్ని ప్రకటించినట్లు పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసి గెలుపొందిన ఆత్రంసక్కు ఆ తర్వాత బీఆర్ఎస్‌లో చేరారు. అప్పటి నుంచి బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నారు. ఇప్పటికే బీజేపీ పార్టీ ఆదివాసీ నేతను అభ్యర్థిగా ఖరారు చేయడం, కాంగ్రెస్‌పార్టీ ఆదివాసీ నేతను బరిలోకి దించేందుకు అవకాశం ఉండడంతో బీఆర్ఎస్ కూడా ఆదివాసీనేతకు అవకాశం కల్పించింది. పొత్తుల్లో భాగంగా ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి బీఎస్పీ పార్టీ అభ్యర్థి, జడ్పీ మాజీ చైర్మన్ సిడాంగణపతికి అవకాశం దక్కుతుందన్న ప్రచారం జరిగింది. కానీ ఆదిలాబాద్ జిల్లా బీఆర్ఎస్ నేతలంతా ఆత్రంసక్కు వైపే మొగ్గు చూపడంతో ఆయన అభ్యర్థిత్వాన్ని పార్టీ అధిష్ఠానం ఖరారు చేసింది. కాగా గత లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున పోటీ చేసి ఓటమిపాలైన నగేశ్.. తనకు ఈసారి టికెట్ దక్కదని భావించి పార్టీని వీడి బీజేపీలో చేరారు. ఆయనకు ఆదిలాబాద్ టికెట్ ప్రకటించారు.

ఘనంగా అభయాంజనేయ ఆలయ వార్షికోత్సవం

జనగామ కల్చరల్, మార్చి 14: జిల్లా కేంద్రంలోని అభయాంజనేయ స్వామి ఆలయ చతుర్థ వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఆలయ ప్రధానార్చకుడు మోహనకృష్ణ భార్గవ నేతృత్వంలో ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనం, నవగ్రహారాధన, నవకలశ స్థాపన, కలశారాధన నిర్వహించారు. అనంతరం స్వామి వారికి విశేషాలంకరణ జరిపారు. ఈ కార్యక్రమంలో గజ్జెల నర్సిరెడ్డి, యెలసాని కృష్ణమూర్తి, రాంబాబు, కందాడి మల్లారెడ్డి, జక్కా నర్సిరెడ్డి, ఉపేందర్‌రెడ్డి, పాశం శ్రీశైలం, రాంప్రసాద్, నాగరాజు, సంజీవరెడ్డి, ఉమాకర్, రవి, అభిగౌడ్ పాల్గొన్నారు.

ఉప్పుగల్లులో పోషకాహార వారోత్సవాలు

జఫర్‌గడ్, మార్చి 14 : మండలంలోని ఉప్పుగల్లులో గల అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహార వారోత్సవాలు నిర్వహించారు. వైస్ ఎంపీపీ కనకయ్య, ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్ సుజాత హాజరై మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పోషక విలువలు గల ఆహార పదార్థాలను తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో నాణ్యమైన పోషకాహారాన్ని అందిస్తున్నారని చెప్పారు. ఆరోగ్య రక్షణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పోషక పదార్థాలు, వాటి ప్రాధాన్యత, బాలింతలు, చిన్నారులు, గర్భిణుల ఆరోగ్య పరిరక్షణ వంటి అంశాలపై సూపర్‌వైజర్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు అనిత, రజిత, ఆయాలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

జీపీని సందర్శించిన అదనపు కలెక్టర్



రికార్డులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

రఘునాథపల్లి, మార్చి 14 : రఘునాథపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీలో వసూలు కావాల్సిన ఇంటి పన్నులతో పాటు ఇతరత్రా ఆదాయ వనరులకు సంబంధించిన వసూళ్లు డిమాండ్ మేరకు అయ్యాయి.. అనే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామ పంచాయతీకి సంబంధించిన ఆదాయ, వ్యయాల వివరాల రికార్డులను పరిశీలించారు. ఇంటి పన్నులు, జీపీకి రావాల్సిన వసూళ్లను ఈ నెలాఖరు లోపు తప్పనిసరిగా వసూలు చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి రంగాచారి, జడ్పీటీసీ బొల్లం అజయ్‌మణికంఠ, ఎంపీడీవో గార్లపాటి శ్రీనివాసులు, ఎంపీవో వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి కవిత తదితరులు పాల్గొన్నారు.

కడియం కావ్యను కలిసిన నేతలు

స్టేషన్‌ఘన్‌పూర్, మార్చి 14: వరంగల్ పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థిగా ఎంపికైన కడియం కావ్యను శివునిపల్లి ఎంపీటీసీ భూర్ల లత-శంకర్ ఆధ్వర్యంలోని బీఆర్ఎస్ శ్రేణులు మర్యాదపూర్వకంగా కలిశారు. హనుమకొండలోని ఆమె నివాసంలో గురువారం కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కావ్యను కలిసిన వారిలో అభ్యుదయ యువజన సంఘం నియోజకవర్గ కన్వీనర్ పోశాల కృష్ణమూర్తి, ఎంపీటీసీ గుర్రం రాజు, పీఏసీఎస్ డైరెక్టర్ తోట సత్యం, భూర్ల రాజు పాల్గొన్నారు.

'ఉత్తమ' అవార్డు అందుకున్న అంగన్‌వాడీ టీచర్

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, మార్చి 14 : స్టేషన్ ఘన్‌పూర్ ముదిరాజ్‌వాడ అంగన్‌వాడీ టీచర్ ఎం.రాణి రెండోసారి రాష్ట్ర స్థాయి ఉత్తమ అంగన్‌వాడీ టీచర్‌గా ఎంపికైంది. గురువారం హైదరాబాద్‌లో ఉన్నతాధికారుల నుంచి అవార్డును అందుకుంది. ఈ సందర్భంగా రాణి మాట్లాడుతూ పదేళ్ల తొలిసారి రాష్ట్ర అవార్డు అందుకున్నానని, రెండోసారి అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. తన సేవలను గుర్తించి అవార్డు అందించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్‌లో భారీగా చేరికలు



కంచనపల్లిలో సింగపురం ఇందిర సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ఎంపీటీసీ రమ్యరాజు, పలువురు నాయకులు

రఘునాథపల్లి, మార్చి 14 : కాంగ్రెస్ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పట్ల ఆకర్షితులైన బీఆర్ఎస్‌కు చెందిన మండలంలోని కంచనపల్లి ఎంపీటీసీ కేమిడి రమ్యరాజుతో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సింగపురం ఇందిర సమక్షంలో గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఆమె కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అంతకుముందు కంచనపల్లిలో ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఇందిర బీరప్ప కురుమ సంఘం కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి పనులను ప్రారంభించారు. మండలంలోని కోడూరు నుంచి లింగాలఘణపురం మండలంలోని చీటూరు గ్రామం వరకు లింకు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోడూరు కాంగ్రెస్ నాయకులు పూజారి మదన్‌మోహన్, శాగంటి అంజయ్య, చంద్రయ్య, పరుశరాములు, బండ అనిల్ సింగపురం ఇందిరకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్ చందర్ రెడ్డి, ఎంపీపీ మేకల వరలక్ష్మినరేందర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోళ్ల రవి, గాదె రమేష్, రంగోజు ఈశ్వరయ్య, లోనే రవిందర్, సోమాజీ, పురుషోత్తం, నీలం యువరాజ్, గొల్లూరి పృథ్వీ పాల్గొన్నారు.

● జఫర్‌గడ్ : మండలంలోని రేగడితండా పరిధి టీబీ తండాకు చెందిన బీఆర్ఎస్ నేత, ఉప సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు లాకావత్ దేవేందర్ తన అనుచరులతో కాంగ్రెస్ పార్టీలో చేరారు. గురువారం స్టేషన్‌ఘన్‌పూర్‌లో జరిగిన కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి సింగపురం ఇందిర సమక్షంలో దేవేందర్‌తో పాటు మరో 30 మంది బీఆర్ఎస్ కార్యకర్తలు జఫర్‌గడ్ మండల పార్టీ నాయకుల నేతృత్వంలో కాంగ్రెస్‌లో చేరినట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా దేవేందర్ నాయక్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలకు స్పందించి బేషరతుగా కాంగ్రెస్‌లో చేరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నూకల అయిలయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అన్నెబోయిన భిక్షపతి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మంచాల ఎల్లయ్య, మండల మాజీ అధ్యక్షుడు కృష్ణమూర్తి, లచ్చిరాంనాయక్, శివనాయక్, కీమా, యాకూబ్, సురేందర్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

యువతకు జనసేన ప్రాధాన్యం

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, మార్చి 14: రాజకీయాల్లో నూతన ఒరవడికి శ్రీకారం చుడుతున్న పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ యువతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ గాదె పృథ్వీ అన్నారు. గురువారం జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని స్టేషన్ ఘన్‌పూర్‌లో పార్టీ పతాకం ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పవన్ కళ్యాణ్ తెలుగు రాష్ట్రాల్లో యువతను ఏకం చేసి రాజకీయాల్లో కీలకంగా ఉండాలని ఆకాంక్షిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రజాక్, ఎం.పవన్, ప్రశాంత్, ఎ.సాయి, వినయ్, బి.శివ, ప్రశాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు

చిలుపూర్, మార్చి 14 : మండలంలోని చిలుపూర్-రాజవరం వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కలువల శ్రీనివాస్ హెచ్చరించారు. రాజవరం సమీపంలోని నిర్మానుష్య ప్రదేశాల్లో కొందరు వ్యక్తులు ఇసుక డంపులను ఏర్పాటు చేశారన్న సమాచారం మేరకు స్థానికులతో కలిసి గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా ఎమ్మార్వై శ్రీనివాస్ మాట్లాడుతూ ఇసుకను కొందరు వ్యక్తులు జేసీబీలు, ట్రాక్టర్ల సాయంతో తరలించడం సరి కాదన్నారు. డంపింగ్‌కు పాల్పడిన వ్యక్తులను గుర్తించి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

రోడ్డు వేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

మాజీ ఎమ్మెల్యే రాజారెడ్డి

జనగామ కల్చరల్, మార్చి 14 : వివాదాస్పద భూమిలో ప్రభుత్వ నిధులతో రోడ్డు వేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే, సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్.రాజారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు గురువారం కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. లింగాలఘణపురం మండలం నెల్లుట్ల గ్రామంలో భూస్వామి లక్ష్మణ్‌సింగ్ తప్పుడు డిక్లరేషన్ ద్వారా కాజేసిన భూమిలో అధికారులు రోడ్డు వేయడం తగదన్నారు. శిఖం భూమి అని తెలిసి కూడా, కోర్టు కేసులో ఉన్నదని తెలిసినప్పటికీ అధికారులు రోడ్డు వేయడం సమంజసం కాదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆది సాయన్న, ఆకుల శ్రీనివాస్, ఎండి.దస్తగిర్, ఎం.జనార్దన్, సొప్పరి సోమయ్య చల్లోజు మల్లేశం, గుర్రం మధు, వెంకటాద్రి పాల్గొన్నారు.

కథల పుస్తకాన్ని ఆవిష్కరించిన డీఈవో

బచ్చన్నపేట, మార్చి 14: బచ్చన్నపేట ఆదర్శ పాఠశాల విద్యార్థులు రచించిన గులాబీలు కథల పుస్తకాన్ని గురువారం జిల్లా విద్యాశాఖాధికారి రాము ఆవిష్కరించారు. 26 కథలతో కూడిన ఈ పుస్తకంలో స్ఫూర్తినిచ్చే వాటిని విద్యార్థులు రాశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ గతంలో కవితలు, ప్రస్తుతం కథల పుస్తకాలు రాసి చిన్నతనంలోనే తమ విజ్ఞానాన్ని పెంపొందించుకున్నారని ప్రశంసించారు. ఇలాంటి వారిని ప్రోత్సహించటం ద్వారా భవిష్యత్‌లో మంచి నిర్ణయాలు తీసుకుని ఎదిగేందుకు ఉపకరిస్తాయన్నారు. కార్యక్రమంలో ఏఎంవో శ్రీనివాస్, ఏఎస్‌వో రమేష్, జిల్లా పరీక్షల విభాగం కార్యదర్శి రామరాజు, ప్రిన్సిపాల్ కృష్ణవేణి, స్థానిక ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వేణు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో హమాలీ సంఘానికి రిజిస్ట్రేషన్

బచ్చన్నపేట, మార్చి 14: స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సహకారంతో మండలంలోని కేశిరెడ్డిపల్లి గ్రామంలో హమాలీ సంఘానికి రిజిస్ట్రేషన్ చేయించి ఇచ్చినట్టు ఎంపీటీసీ కర్నాల వేణుగోపాల్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు కాపర్తి హరిప్రసాద్ తెలిపారు. హమాలీలు సంఘటితంగా ఉండాలని, ప్రభుత్వాలు అందించే లబ్ధి పొందాలంటే రిజిస్ట్రేషన్ ద్వారా గుర్తింపు పొంది ఉండాలన్నారు. శ్రీసిద్ధేశ్వర హమాలీ సంఘం పేరిట రిజిస్టరైన పత్రాలను సంఘం నాయకులకు అందించారు. కార్యక్రమంలో భాస్కర్, కుమారస్వామి, నర్సింహులు, కిష్టయ్య, నరేష్, చెన్నయ్య, దేవయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఆపరేటర్లను విధుల్లోకి తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు

పాలకుర్తి, మార్చి 14 : విద్యుత్ సబ్‌స్టేషన్లలో తాత్కాలికంగా పనిచేస్తున్న ఆపరేటర్లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాపర్తి రాజు ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రంలోని చాకలి ఐలమ్మ స్మారక భవనంలో తొలగించిన విద్యుత్ సబ్‌స్టేషన్ల ఆపరేటర్లతో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో రాజు మాట్లాడారు. పాలకుర్తి నియోజకవర్గంలో కడవెండి, ఏడునూతుల, చర్లపాలెం, బొమ్మకల్ విద్యుత్ సబ్‌స్టేషన్లకు పదేళ్ల క్రితం రైతుల వద్ద భూమిని తీసుకొని నిర్మించారని తెలిపారు. ఆ సమయంలో మాజీ మంత్రి దయాకర్‌రావు సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు భూమి ఇచ్చిన రైతుల కుటుంబాల్లో ఒక్కరికి చొప్పున ఉద్యోగం ఇస్తామన్నారని గుర్తు చేశారు. గత ఏడాది సెప్టెంబరులో విద్యుత్ సబ్‌స్టేషన్లలో ఆపరేటర్లుగా ఆర్డర్ ఇచ్చారని తెలిపారు. సుమారు ఆరు నెలల పాటు విధులు నిర్వహించి వేతనాలు అందుకున్నారని అన్నారు. అయితే అధికారులు వీరికి ఉద్యోగాలు ఇచ్చినట్లే ఇచ్చి తొలగించారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తొలగించిన ఆపరేటర్లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. సమావేశంలో నాయకులు చిట్యాల సోమన్న, బత్తిని వెంకన్న పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే సుధాకర్‌రావు అంత్యక్రియలు పూర్తి



సుధాకర్‌రావు భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

పెద్దవంగర, మార్చి 14 : మాజీ ఎమ్మెల్యే డాక్టర్ నెమురుగొమ్ముల సుధాకర్‌రావు అంత్యక్రియలు గురువారం సాయంత్రం ఆయన స్వగ్రామమైన మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం వడ్డెకొత్తపల్లిలో పూర్తయ్యాయి. కిడ్నీ సంబంధ వ్యాధితో హైదరాబాద్ యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఉండగా.. గుండెపోటుకు గురై ఆయన బుధవారం రాత్రి తుదిశ్వాస విడిచారు. దీంతో గురువారం ఉదయం కుటుంబసభ్యులు ఆయన పార్థివదేహాన్ని వడ్డెకొత్తపల్లి గ్రామానికి తీసుకువచ్చారు. ప్రజల సందర్శనార్థం భౌతికకాయాన్ని నివాసంలో ఉంచగా.. ఆయన్ను కడసారి చూసేందుకు అభిమానులు భారీగా తరలొచ్చారు. పలువురు పార్టీల నాయకులు, బంధువులు, మిత్రులు సుధాకర్‌రావు భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సుధాకర్‌రావు మృతితో పాలకుర్తి నియోజకవర్గం ప్రజలు విషాదంలో మునిగిపోయారు. మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు, మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, పొన్నాల లక్ష్మయ్య, ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రామచంద్రునాయక్, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఆయన సతీమణి వినయరాణి, పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని, మహబూబాబాద్ ఎంపీ మాలోతు కవిత, ఎమ్మెల్సీ తక్కళ్లపెల్లి రవీందర్, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, మాజీ ఎమ్మెల్యేలు రెడ్యానాయక్, శంకర్‌నాయక్, శ్రీరాంభద్రయ్య, పెద్ది సుదర్శన్‌రెడ్డి, ధర్మారావు, రాజేశ్వర్‌రావు, మానుకోట మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామోహ్మన్‌రెడ్డి, ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, గూడిపుడి నవీన్‌రావు, సంకినేని వెంకటేశ్వర్లు, దశమంత్ రెడ్డి, దుగ్యాల హరీష్‌రావు, రామచంద్రయ్య, రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు సుధాకర్‌రావు మృతదేహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుధాకర్‌రావు నియోజకవర్గ అభివృద్ధి కోసం చేసిన కృషిని, సేవలను, ఆయనతో వారికి ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ప్రముఖ వైద్యుడిగా, పాత చెన్నూరు (ప్రస్తుత పాలకుర్తి) ఎమ్మెల్యేగా అందించిన సేవలు మరువలేనివన్నారు. ఇక సాయంత్రం జరిగిన అంత్యక్రియల్లో మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రామచంద్రునాయక్ పాల్గొని పాడె మోశారు.

డాక్టర్ సుధాకర్‌రావుకు ఘన నివాళి



దేవరుప్పులలో సుధాకర్‌రావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎర్రబెల్లి

దేవరుప్పుల, మార్చి 14 : చెన్నూరు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ నెమురుగొమ్ముల సుధాకర్‌రావు కిడ్నీ సంబంధిత వ్యాధితో సికింద్రాబాద్‌లోని యశోద హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందిన విషయం విదితమే. దేవరుప్పులలోని చౌరస్తా వద్ద గురువారం బీఆర్ఎస్ మండల నాయకుల ఆధ్వర్యంలో ఆయన చిత్రపటం ఏర్పాటు చేయగా, ముఖ్య అతిథిగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు హాజరై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ సుధాకర్‌రావు అకాల మృతి పాలకుర్తి నియోజకవర్గానికి తీరని లోటన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తీగల దయాకర్, నాయకులు బస్వ మల్లేశం, ఏలె సోమసుందర్, గండిపెల్లి యాకయ్య, హన్మంతు, చింత రవి, తాటిపెల్లి మహేష్, సోమనర్సయ్య, కృష్ణమూర్తి, భిక్షపతి, ఉప్పల్‌రెడ్డి, తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

● పాలకుర్తి : మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎన్.సుధాకర్‌రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ మండల అధ్యక్షుడు నవీన్, జడ్పీటీసీ ముస్కు రాంబాబు మాట్లాడుతూ నియోజకవర్గంలో రాజకీయంగానే కాకుండా డాక్టర్‌గా ఎంతో సేవచేశారని గుర్తుచేశారు. ఆయన మరణం బీఆర్ఎస్‌కు తీరని లోటన్నారు. నాయకులు మాచెర్ల ఎల్లయ్య, పోశాల వెంకన్న, మల్లేష్, భాస్కర్‌రెడ్డి, మహేందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

● కొడకండ్ల : మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సిందె రామోజీ ఆధ్వర్యంలో మాజీ శాసన సభ్యుడు సుధాకర్‌రావు చిత్రపటానికి నాయకులు నివాళులర్పించారు. చెన్నూరు నియోజకవర్గంలో ఆయన టీడీపీ నుంచి 1999లో శాసనసభ్యుడిగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఈజీఎస్ డైరెక్టర్ అందె యాకయ్య, బీఆర్ఎస్ నాయకులు పి.రాము, పి.మధుసూదన్, నారాయణరెడ్డి, ఎం.వెంకటనారాయణ, రాజిరెడ్డి, వెంకటేష్‌రావు, ప్రేమ్‌కుమార్, రాగ్యా పాల్గొన్నారు.

కార్పొరేషన్ ఏర్పాటు అభినందనీయం

చిలుపూర్, మార్చి 14: ఆర్యవైశ్యుల సంక్షేమం కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయడం అభినందనీయమని జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకుడు, మండలంలోని వెంకటాద్రిపేట గ్రామానికి చెందిన మంతెన లవకుమార్ గుప్త అన్నారు. పీసీసీ రాష్ట్ర నాయకురాలు కలువ సుజాత నేతృత్వంలో ఆయన గురువారం సీఎం రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆర్యవైశ్యుల సంక్షేమమే ధ్యేయంగా పాటుపడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి తామంతా ఎల్లవేళలా అండగా ఉంటామని పేర్కొన్నారు.

సుధాకర్ మృతి సీపీఎంకు తీరని లోటు

బచ్చన్నపేట, మార్చి 14 : సీపీఎం నాయకుడు బెల్లంకొండ సుధాకర్ మృతి పార్టీకి తీరని లోటని జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. మండలంలోని తమ్మడపల్లి గ్రామంలో ఇటీవల సుధాకర్ మృతి చెందగా సంస్మరణ సభను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేద, బడుగు బలహీన వర్గాల కోసం సుదాకర్ కుటుంబం పనిచేస్తోందన్నారు. సుధాకర్ ఆశయాల కోసం పని చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బూడిద గోపి, సుంచు విజేందర్, ఎల్లయ్య, నర్సింహులు, రాములు, ఉపేందర్, మహేందర్, గణేశ్ పాల్గొన్నారు.

బీజేపీ సోషల్ మీడియా జిల్లా కన్వీనర్‌గా శ్రీనివాసరావు

పాలకుర్తి, మార్చి 14 : భారతీయ జనతా పార్టీ సోషల్ మీడియా కన్వీనర్‌గా పాలకుర్తి మండలం విస్నూరు గ్రామానికి చెందిన అయిర్నేని శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత్‌రెడ్డి నియామక పత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తానని తెలిపారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

చిలుపూర్, మార్చి 14 : విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని స్వచ్ఛంద సేవకులు ఊరడి సతీష్, పసుల వెంకటేశ్వర్లు, హెచ్‌ఎం దాసి శ్రవణ్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని మల్కాపూర్, చిలుపూర్, చిన్నపెండ్యాల, పల్లగుట్ట తదితర గ్రామాల్లో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ నెల 18 నుంచి జరుగనున్న పదో తరగతి పరీక్షలకు సంబంధించి విద్యార్థులకు అవసరమైన సామగ్రిని ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కరుణాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, సుధ, మాధవి తదితరులు పాల్గొన్నారు.

బుగులు వెంకన్న ఆలయ ఉత్సవ కమిటీ ఎన్నిక

చిలుపూర్, మార్చి 14 : ఈ నెల 16 నుంచి జరుగనున్న చిలుపూర్ గుట్ట బుగులు వెంకన్న ఆలయ బ్రహ్మోత్సవాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఉత్సవ కమిటీని నియమించింది. టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి సింగపురం ఇందిర ప్రత్యేక చొరవతో ఏర్పాటైన ఈ కమిటీలో 14 మందిని సభ్యులుగా నియమించారు. వీరిలో ఒకరిని చైర్మన్‌గా ఎన్నుకుంటారు. ఇందులో మామిడాల యాదవరెడ్డి, పెద్ది నారాయణ, పుల్యాల నారాయణరెడ్డి, జక్కుల రాజశేఖర్, కనకం మధు, గాజుల రజని, బాలరాజు, పుట్ట కిరణ్‌రెడ్డి, మేకల మల్లేశం, దూబ ఎల్లయ్య, సత్యనారాయణ, వికాస్‌రెడ్డి, గణేష్, మోహన్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా మామిడాల యాదవరెడ్డి మాట్లాడుతూ చిలుపూర్ గుట్ట బ్రహ్మోత్సవాలను 14 రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహించడంతో పాటు సింగపురం ఇందిర సహకారంతో ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

జీడికల్ దేవస్థానానికి ఉత్సవ కమిటీ నియామకం

లింగాలఘణపురం, మార్చి 14 : మండలంలోని సుప్రసిద్ధ జీడికల్ వీరాచల సీతా రామచంద్రస్వామి దేవస్థానానికి 12 మంది ధర్మకర్తలతో తాత్కాలిక ఉత్సవ కమిటీని నియమిస్తూ దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ అనిల్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ధర్మకర్తలుగా ఏలె నర్సింహ్మామూర్తి(కళ్లెం), కొల్లూరు శివకుమార్(వడ్డిచర్ల), మంద శ్రీధర్‌రెడ్డి(లింగాలఘణపురం), కూకట్ల రాజు(కుందారం), మన్నె యాదవరెడ్డి(వనపర్తి), గునిగంటి చంద్రశేఖర్(కొత్తపల్లి), మొటికె శ్రీశైలం(నాగారం), మారబోయిన ఉప్పలయ్య(నెల్లుట్ల), కొండబోయిన సంపత్(జీడికల్), బస్వగాని నరేశ్(సిరిపురం), కత్తుల శ్రీనివాస్‌రెడ్డి(గుమ్మడవెల్లి), కడకంచి లక్ష్మి(లింగాలఘణపురం), సావిల్ల సోమయ్య(చీటూరు)లు నియామకమయ్యారు. అయితే 12 మంది ధర్మకర్తలతో కూడిన ఈ తాత్కాలిక కమిటీ ఏప్రిల్ 15 నుంచి 20 వరకు మాత్రమే కొనసాగనున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఎన్‌సీసీతో విద్యార్థులకు ఉద్యోగావకాశాలు



ఎన్‌సీసీకి ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు, ఎన్‌సీసీ అధికారులు

స్టేషన్‌ఘన్‌పూర్, మార్చి 14 : ఎన్‌సీసీ క్యాడెట్స్‌గా ఎంపికైన విద్యార్థులకు భవిష్యత్‌లో అనేక ఉద్యోగ అవకాశాలు ఉంటాయని ఛాగల్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం జి.కొమురయ్య తెలిపారు. మండలంలోని ఛాగల్ ఉన్నత పాఠశాలలో గురువారం ఎన్‌సీసీ అధికారి రుద్రారపు శాంతి ఆధ్వర్యంలో ఎన్‌సీసీ క్యాడెట్స్ ఎంపిక పోటీలను నిర్వహించారు. 50 మంది విద్యార్థులు హాజరు కాగా నైపుణ్యం ప్రదర్శించిన 15మంది బాలురు, 10మంది బాలికలను ఎన్‌సీసీ క్యాడెట్స్‌గా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ పాఠశాల దశలో ఎన్‌సీసీ క్యాడెట్స్‌గా ఎంపిక కావడం వలన భవిష్యత్‌లో ఉద్యోగాల నియామకాల్లో ప్రత్యేక కోట ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆర్మీ అధికారులు చౌరాసియా, షబ్బీర్, ప్రకాశం, ఉపాధ్యాయులు అంజిరెడ్డి, రాజేంద్రప్రసాద్, పరమేశ్వరి, సుదర్శన్, దేవేందర్‌కౌర్, సాయికుమార్, రమేష్, కరంచంద్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ల శాఖలో.. అక్రమాల పర్వం!

(3వ పేజీ తరువాయి)

చేయాల్సి ఉంటుంది. మిగతా 12 సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో కేవలం 36 స్లాట్స్‌కు అవకాశం ఉంటుంది. నగర పరిధిలోని రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో నిబంధనల మేరకు 36 స్లాట్లకు రిజిస్ట్రేషన్లు చేస్తున్న సబ్ రిజిస్ట్రార్‌లు నాన్ స్లాట్ రిజిస్ట్రేషన్లు సైతం చేస్తుంటారు. ఇదంతా మధ్యవర్తుల కనుసన్నల్లోనే జరుగుతోందన్న విమర్శలున్నాయి. స్లాట్ బుక్ చేసుకోకుండా నేరుగా వచ్చే క్రయవిక్రయదారుల వద్ద ఇష్టం వచ్చినంత వసూలుచేసి తతంగం పూర్తిచేస్తారనే ఆరోపణలున్నాయి. నాన్ స్లాట్ రిజిస్ట్రేషన్లు చేసే సబ్ రిజిస్ట్రార్లు కూడా ఆదాయం వస్తుండటంతో కార్యాలయ సమయం పూర్తయినా లెక్కచేయకుండా రిజిస్ట్రేషన్లు చేస్తారని తెలిసింది. స్లాట్‌బుకింగ్ రిజిస్ట్రేషన్ల కంటే నాన్ స్లాట్ రిజిస్ట్రేషన్ల ద్వారానే పెద్ద ఎత్తున ముడుపులు అందుతాయనే ప్రచారం ఉంది.

దృష్టి సారించని శాఖ ఉన్నతాధికారులు

ప్రతీ కార్యాలయంలో దందాలు కొనసాగుతుంటాయనే సమాచారం ఉన్నా రిజిస్ట్రేషన్లు, స్టాంపుల శాఖ ఉన్నతాధికారులు అంతగా స్పందించడం లేదనే విమర్శలున్నాయి. మీడియాలో వార్తలు వచ్చినప్పుడు నామమాత్రపు తనిఖీలుచేసేఅధికారులు మిగతా రోజుల్లో కార్యాలయాలవైపు కన్నెత్తి చూడరనే ఆరోపణలున్నాయి. కొన్ని సందర్భాల్లో అవకతవకలకు పాల్పడే ఉద్యోగులపై చర్యలు తీసుకుంటున్న ఉన్నతాధికారులు పెండింగ్ విచారణ పేరుతో కోరుకున్న స్థానాల్లో పునర్నియామకం చేస్తున్నారనే విమర్శలున్నాయి. జిల్లాలో ఆరోపణలతో వేటు పడిన కొందరు ఉద్యోగులు పెండింగ్ విచారణ పేరిట ఆదాయం ఉండే స్థానాల్లో పోస్టింగ్ తీసుకుని కొనసాగుతుండటం గమనార్హం.

సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం

జఫర్‌గడ్, మార్చి 14: ఆర్యవైశ్య కార్పొరేషన్‌ను సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం పట్ల మండల ఆర్యవైశ్యులు హర్షం వ్యక్తం చేస్తూ సంబురాలు జరుపుకున్నారు. గురువారం జఫర్‌గడ్‌లోని ఆర్యవైశ్య భవన్‌లో సీఎం చిత్ర పటానికి ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర, జిల్లా, మండల ప్రతినిధులు, ఆర్యవైశ్యులు క్షీరాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర నాయకుడు చిటిమల్ల కృష్ణమూర్తి మాట్లాడుతూ ఆర్యవైశ్యుల్లో చాలా మంది పేదలు ఉన్నారన్నారు. వీరంతా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక దుర్భర జీవితాలు గడుపుతున్నారని తెలిపారు. గత ప్రభుత్వం తమను పట్టించుకోలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయడంతో ఆర్యవైశ్యుల్లో ఆనందం వ్యక్తమవుతోందన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా, మండల ప్రతినిధులు రేవూరి రమేశ్, శ్రవణ్‌కుమార్, మణికాంత్, సీతరాములు, యుగంధర్, శ్రీనివాస్, ఇమ్మడి అశోక్, దొడ్డ రమేశ్, దాంశెట్టి సోమేశ్వర్, దొడ్డ రాజ్‌కుమార్, హరిశంకర్, నాగార్జున్ తదితరులు పాల్గొన్నారు.

ఠాను నాయక్ వర్ధంతి సభను జయప్రదం చేయాలి

దేవరుప్పుల, మార్చి 14: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటయోధుడు జాటోతు ఠాను నాయక్ 74వ వర్ధంతి సభను జయప్రదం చేయాలని సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు ధరావత్ శంకర్‌నాయక్ కోరారు. ఠాను నాయక్ స్వగ్రామమైన మండలంలోని ధర్మాపురంలో గురువారం మండల సేవాలాల్ సేన ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై సభ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 20న ధర్మాపురంలో ఠాను నాయక్ 74వ వర్ధంతి సభ నిర్వహించనున్నట్టు తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సేవాలాల్ విద్యార్థిసేన జిల్లా కార్యదర్శి లావుడియా అనిల్ చౌహాన్, జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనివాస్, మండల అధ్యక్షుడు కున్సోత్ బిక్కు, మండల ప్రతినిధులు సంతోష్, శ్రీను, సోమన్న, రాంచెంద్రు, నర్సింహ పాల్గొన్నారు.

చెరువులు, కుంటల్లో నీరు నింపాలి

స్టేషన్‌ఘన్‌పూర్, మార్చి 14: మండలంలోని తానేధార్‌పల్లి గ్రామంలో గల చెరువులు, కుంటలను ఆర్ఎస్ ఘన్‌పూర్ రిజర్వాయర్ ప్రధాన కాలువ ద్వారా నీటిని నింపాలని కాంగ్రెస్ పార్టీ రైతు విభాగం రాష్ట్ర నాయకుడు మంతెన ఇంద్రసేనారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగపురం ఇందిరను గురువారం పలువురు నాయకులతో కలిసి వినతిపత్రం అందించారు. ఆర్ఎస్ ఘన్‌పూర్ రిజర్వాయర్ ద్వారా యాసంగి పంటలకు సాగునీరు వస్తుందనే నమ్మకంతో పంటలు వేశామని అన్నారు. ప్రధానకాలువ నుంచి సబ్ కెనాల్స్‌కు నీటిని పంపించి గ్రామంలోని చెరువులు, కుంటలను నింపేలా చర్యలు తీసుకోవాలని రైతులు ఇందిరకు వివరించారు. విశ్వనాథపురం క్రాస్ రోడ్డు నుంచి జఫర్‌గడ్ మండలం తమ్మడపల్లి(జీ) వరకు రోడ్డు పూర్తిగా దెబ్బతినడమే కాకుండా కల్వర్టులు ప్రమాదకరంగా ఉన్నాయని తెలిపారు. వాటికి మరమ్మతులు చేసి రోడ్డును విస్తరించాలని కోరారు. స్పందించిన ఆమె త్వరితగతిన చెరువులు, కుంటల్లో నీరు నింపేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. రోడ్డు పనుల విషయమై మంత్రి దృష్టికి తీసుకెళ్లి పనులు పూర్తి చేసేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు మంతెన రమేష్‌రెడ్డి, మాచర్ల ఉప్పలయ్య, గడెం కొమురయ్య, ఎర్రెడ్డి లింగారెడ్డి, చుక్క రమేష్, హరీష్, అరుణ్‌కుమార్, భిక్షపతి, బాబు, తిరుపతి, సత్తయ్య, కిష్టయ్య, మహిపాల్, రాంరెడ్డి, అక్బర్ పాషా పాల్గొన్నారు.